క్లుప్తంగా

వైవీయూ ఆర్ట్స్‌బ్లాక్ తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్‌బ్లాక్‌లోని పలు విభాగాలను వైస్ చాన్స లర్ ఆచార్య చింతా సుధాకర్ శనివారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకుల, బోధనేతర సిబ్బంది, పరిశోధ కుల హాజరును ప్రత్యక్షంగా పరిశీలించారు. సెలవులో ఉన్నవారి అనుమతి పత్రాలను పరి శీలించారు. తక్కువ హాజరు ఉన్నవారిని పరీక్ష లకు అనుమతించవద్దని సూచించారు. అకడ మిక్ విషయాలపై చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధ్యాప కులు పాల్గొన్నారు.

భూమి పూజ

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కృ ష్ణాపురం చుట్టుపక్కల గ్రామ పేదల కోసం కళ్యాణ మండపం నిర్మాణానికి కేఎస్ఆర్ఎం మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి(నాని) శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఐదు నెలలలో ఈ కళ్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తెస్తామని తెలిపారు. పేద ప్రజల కోసం కళ్యాణ మండపం నిర్మించాలనేది కందుల శివానందరెడ్డి ఆశయం అని, ఆయన ఆశయాన్ని నేడు నెరవేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ఎం కరస్పాండెంట్స్ కందుల రాజేశ్వరమ్మ, కందుల మదన్‌మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన సన్మానం



అంజద్‌బాషాను సత్కరిస్తున్న దాసరి శివప్రసాద్

కడప కల్చరల్ : డిప్యూటీ సీఎం అంజద్‌బాషకు కడప అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ టిక్కెట్ ఖరారు అయిన సందర్భంగా బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్షులు దాసరి శివప్రసాద్ ఆయనను కార్యాలయంలో కలిసి తమ సంస్థ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లుపంచి, బాణాసంచా కాల్చి తమ సంతోషం వ్యక్తం చేశారు. హ్యాట్రిక్ విజయం సాధించగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు మునిమోహన్‌రాయల్, నీలం రవి, కొమ్మినేని చంద్ర, గంగయ్య, బ్రహ్మయ్య, సురేష్, సంద్ర మధుసూదన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో సేవా దృక్పథం

కడప ఎడ్యుకేషన్ : ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థులకు సేవాదృక్పథం అలవడుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు పేర్కొన్నారు. శనివారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యా ర్థులు నగరంలోని కో ఆపరేటివ్ కాలనీలో ఎన్ ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు కళాశాల విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పోగ్రాం ఆఫీసర్ షకీలాబేగం, గోవిందరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

కడప సెవెన్‌రోడ్స్ : హెచ్‌పీ గ్యాస్ వినియోగదా రులు తప్పనిసరిగా ఈకేవైసీ, సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ చేయించుకోవాలని గ్యాస్ ఏజెన్సీ అధినేత గరిశా వెంకటరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈకేవైసీ సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ ఉచితంగా చేస్తున్నామన్నారు. ఈనెలాఖరులోపు ఇవి చేయించుకోని వారికి కేంద్రం మంజూరు చేసే రాయితీలు రావని స్పష్టం చేశారు. తమ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి వివరాలు యాప్‌లో నమోదు చేస్తారని ఆయన వివరించారు.

పరిశ్రమ ప్రారంభం



పరిశ్రమను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం నారాయణరావు

కడప కార్పొరేషన్ : కడప నగర శివార్లలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉపన్య ఇండస్ట్రీస్‌ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ నారాయణ రావు, చీఫ్ మేనేజర్ కె. అమర్‌లు ప్రారంభించారు. అనంతరం వారు మిషనరీని పరిశీలించి, అవి పనిచేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎం నారాయణరావు మాట్లాడుతూ పేపర్ ప్లేట్ల రా మెటీరియల్స్ తయారు చేయడంలో అనుభవం ఉన్న కేవీ సురేష్ ఆ ఇండస్ట్రీని కొప్పర్తిలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిక్కీ జిల్లా కన్వీనర్ ఓబిలి శంకర్, సిక్కీ జిల్లా కన్వీనర్ సి. బాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు గుండ్లపల్లి గరుడాద్రి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ మహేష్, ఎల్ఎం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభం

చెన్నూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాలను శనివారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.4 కోట్ల 70 లక్షలతో ఈ భవనాలను నిర్మించామన్నారు. వైద్య సిబ్బంది కూడా సమయపాలన పాటించాలన్నారు.

మహనీయుడు పొట్టిశ్రీరాములు



వైవీయూలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, ప్రిన్సిపాల్



డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, అధ్యాపకులు

వైవీయూ : తెలుగువారి కోసం, ప్రత్యేక రాష్ట్రసాధన కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి అమరజీవి పొట్టిశ్రీరాములు అని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం శ్రీరాములు చేసిన త్యాగాన్ని గుర్తుచేశారు. రాష్ట్రసాధన కోసం ప్రాణాలను సైతం అర్పించిన మహాపురుషుడు అని కొనియాడారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు జీవితంలో ప్రధాన అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో..

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి, మహాపురుషుడు పొట్టిశ్రీరాములు అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బి. అంజనేయప్రసాద్ కొనియాడారు. శనివారం విశ్వవిద్యాలయంలో పొట్టిశ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, సుశీల్ కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ వైఎస్సార్‌సీపీలో చేరిక



మాజీ కార్పొరేటర్ గుర్రం గంగాధర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : మాజీ కార్పొరేటర్, ఎలక్ట్రికల్, ప్లంబర్ అసోసియేషన్ నాయకుడు గుర్రం గంగాధర్, అసోసియేషన్ సభ్యులు ప్రసాద్, గుర్రం కొండయ్యలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం సాయంత్రం వారి స్వగృహంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గుర్రం గంగాధర్ మాట్లాడుతూ కుల, మతాలకు వర్గాలకు అతీతంగా జనరంజక పాలన అందిస్తున్న వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో ఏర్పడే ప్రభుత్వం మాత్రమే మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పరుస్తుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే ప్రజలు సంతోషంగా ఉండగలుగుతారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, రాణా ప్రతాప్, తోట క్రిష్ణ, రామ్మోహన్ రెడ్డి, ఏ . బాలక్రిష్టారెడ్డి, షఫీ, గంగరాజు, మాస్టర్ అహ్మద్, సమరనాథ్‌రెడ్డి, శంకరాపురం సింధు, సునీత, మౌలాని, సాయి హుస్సేన్ పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో అత్యుత్తమ శిక్షణ



శిక్షణ పొందిన డ్రైవర్లతో డీఎం డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు ద్వారా అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని, దీనిని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. శనివారం ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న 19వ బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. డీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు 19 బ్యాచ్‌ల శిక్షణ పూర్తయిందని, 20వ బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 16 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. 30 ఏళ్ల అనుభవంగల రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ల చేత థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గ్యారేజీలో సుదీర్ఘ అనుభవంగల మెకానిక్‌లచే వాహన విడిభాగాలు చూపించడం, వాటి పనితీరు, సామర్థ్యం, బస్సు పనితీరు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందేవారు 99592 25774, 73828 65145 నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ల జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గం.. రాజ మార్గం



లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ లావణ్య

కమలాపురం : కేసుల పరిష్కారంలో రాజీ మార్గం.. రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించు కోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 47 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 33 క్రిమినల్, 9 సివిల్, 5 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. మెజిస్ట్రేట్ కక్షిదారులను చేతులు కలిపి రాజీ చేశారు. అనంతరం వారిని ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. ముఖ్యంగా సమస్యలున్నవారు కక్షిదారులు కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా గ్రామ పెద్దల ఎదుట పరిష్కరించు కోవచ్చన్నారు. లేని పక్షంలో పోలీసులు, కోర్టు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : స్థానిక కోర్టులో శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఎస్.భార్గవి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలకు పట్టుదలకు పోయి పోలీస్‌స్టేషన్‌లలో కేసులు పెట్టుకోకుండా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా 901 కేసులు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువులతోనే ఉన్నత జీవితం

కడప కల్చరల్ : ఉన్నతంగా చదువుకున్న వారికే ఉన్నతమైన జీవితం లభిస్తుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏలూరి ప్రభుదాస్ పిలుపునిచ్చారు. శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మద్రాస్ రోడ్డు, ప్రకాష్ నగర్‌లలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న బాలుర, బాలికల హాస్టల్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల పట్ల అవగాహన కల్పిస్తూ, పెన్నులు, ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మడగలం ప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి తస్లీమ్, స్రవంతి, అమృత, ఎలిజబెత్, హాస్టల్ వార్డెన్స్, లీలావతి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన క్రైమ్ ఎంటర్‌ట్రైన్‌మెంట్, ఎస్ఎం మేకర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆ ఊరి కథ సినిమాను నిర్మిస్తుండడం అభినందనీయమని వ్యాపారవేత్త జీఎస్ఆర్ జ్యువెలర్స్ అధినేత గోవిందునాగరాజు అన్నారు. శనివారం నగరంలోని బెల్లంమండీ వీధిలోగల శ్రీ బాల పోలేరమ్మ ఆలయంలో ఆ మేరకు నిర్మాతలు రూపొందించిన పోస్టర్లను ఆయన విడుదల చేసి సినిమా నిర్మాణానికి క్లాప్ కొట్టారు. అనంతరం నిర్మాణ బాధ్యుల్లో ఒకరైన శ్రీకాంత్ మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి కడప పరిసర ప్రాంతాల్లో షూటింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, హసన్‌రాజ్, హర్షరాజ్, జార్జి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నందిగామలో హెల్త్‌కేర్ కౌన్సిలర్, కో ఆర్డినేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై 19–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. 60 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

కడప తాలూకా సీఐగా తిమ్మయ్య



కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐగా ఎం. తిమ్మయ్య బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా శిరివెళ్లకు చెందిన తిమ్మయ్య 2004లో ఆర్ఎస్ఐగా పోలీసుశాఖలో విధుల్లో చేరారు. తరువాత 2009లో సివిల్ విభాగం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు, అనంతపురం జిల్లాలలో ఎస్ఐగా పనిచేశారు. 2023లో సీఐగా పదోన్నతి పొందారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో సీఐగా పనిచేస్తూ వీఆర్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి కడప తాలూకాకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరారు. శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేస్తామన్నారు. కడప తాలూకా సీఐగా పనిచేస్తున్న పి. రాజాను కర్నూలు వీఆర్‌కు బదిలీ చేశారు.

హోంశాఖ మంత్రికి ఘన స్వాగతం



ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద మంత్రి తానేటి వనితకు స్వాగతం పలుకుతున్న డీఎస్పీ షరీఫ్

కడప అర్బన్ : రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత శనివారం ఉదయం 7:50 గంటలకు కడపలోని ఆర్ అండ్ బి అతిథిగృహంకు విచ్చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు విచ్చేసి ఇడుపులపాయలో తమ పార్టీ తరపున రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలలో పోటీ చేయబోయే అభ్యర్థుల జాబితాను ప్రకటించిన విషయం విదితమే. ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కడపకు విచ్చేసిన హోం మంత్రికి కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీతో పాటు కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

జగనన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతి అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా గుర్తిస్తూ వారికి వేతనాలు 010 పద్దు కింద చెల్లించాలని జగనన్న ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3వేల మందికిపైగా ఉన్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మోడల్ స్కూల్ సొసైటీలో కొనసాగుతూ, ఎన్నో ఏళ్లుగా తమను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా గుర్తించాలని కోరుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిందన్నారు. 1998 డీఎస్సీ రాసి ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న 4వేల మందికిపైగా అభ్యర్థులకు పోస్టింగులు ఇచ్చారని గుర్తు చేశారు. 11వేల మందికిపైగా కాంట్రాక్టు పోస్టులను రెగ్యులర్ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 59వేల మందికి బదిలీలు, పదోన్నతులు కల్పించారన్నారు.

ఉపాధ్యాయుల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కున్న చిత్తశుద్ధికి ఇవి నిదర్శనాలన్నారు. ఎంఈఓ-2 పోస్టులను సృష్టించి అర్హులైన వారికి పదోన్నతులు కల్పించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను నీచంగా చూసిందని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ ప్రభుత్వానికి మద్దతిచ్చి, నడిపించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శరత్‌బాబు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొర్రపాటి శరత్‌బాబు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కొర్రపాటి శరత్ బాబును నియమిస్తున్నట్లు కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. నియామకం జరిగిన వెంటనే విజయవాడ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొర్రపాటి శరత్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాపై నమ్మకంతో ఈ పదవి ఇవ్వడంపై ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. నాకు ఈ పదవి రావడానికి సహకరించిన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేస్తానని అన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి



చిన్నారులకు వేయాల్సిన వ్యాక్సిన్లపై ప్రచారం చేస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి తల్లీ తమ బిడ్డలకు ఖచ్చితంగా క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.ప్రసన్నలత సూచించారు. శనివారం నాగరాజుపేట–1 సచివాలయానికి సంబంధించిన వార్డు ఏరియాలో నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యాక్సిన్ వల్ల ఉపయోగాలు, ఏయే వ్యాధులు రాకుండా ఏ ఇంజెక్షన్ ఇస్తున్నారో అంగన్వాడీ కేంద్రంలోని తల్లులకు వివరించారు. శిక్షణా వైద్యులచే వడదెబ్బ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో శిక్షణా వైద్యులు దినేష్, మనిశ్వని, ఝాన్సీ, గీత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తాం

కమలాపురం : అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజల సహకారంతో మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తామని రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఎన్నికల నియమావళికి సంబంధించిన నిబంధనలు వెల్లడించారు. ముఖ్యంగా మోడల్ కోడ్‌కాండక్ట అమల్లోకి వచ్చిందన్నారు. 24 గంటల్లోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, సీఎం, మంత్రుల ఫొటోలతో పాటు బయట ఉన్న ఫ్లెక్సీ తదితర వాటిని తొలగిస్తామన్నారు. 36 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో, 72 గంటల్లో అన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, ఫొటోలు, హోర్డింగ్స్ తొలగించాలని ఈసీ ఆదేశాలు ఉన్నాయన్నారు. అయితే తాము వాటిని సగం సమయంలోనే తొలగిస్తామన్నారు. పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఇళ్లలో ఏర్పాటు చేసుకునే వారు సైతం తమ అనుమతి తీసుకోవాలని, అందుకు అయిన ఖర్చును అభ్యర్థి అకౌంట్‌లో రాస్తామన్నారు. వెహికల్‌కు ఏర్పాటు చేసే జెండా ఖర్చు సైతం లెక్కిస్తామన్నారు. సీకేదిన్నెలో జిల్లా చెక్ పోస్ట్ ఉంటుందని, అక్కడ అన్ని వాహనాలను నిశితంగా పరిశీలిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలు వెచ్చించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 26న స్క్రూటనీ, 29న ఉపసంహరణ మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 27రూట్లలో 251 పోలింగ్ స్టేషన్లు ఉండగా అందులో 58 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. తమకు అన్ని రాజకీయ పార్టీలు సమానమేనని, రాగద్వేషాలు ఉండవని, అందరి సహకారంతో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు.

జగనన్న ఇళ్లు కాదు.. ఊళ్లనే నిర్మించారు

ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



కమలాపురంలో మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సీకేదిన్నెలో లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి

కమలాపురం : సొంతిల్లు లేని అక్కచెల్లెమ్మల కల నెరవేర్చడానికి సీఎం జగనన్న ఇళ్లు కాదు... ఊళ్లు నిర్మించారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక 3వ వార్డు సచివాలయం వద్ద తహసీల్దార్ సుబ్రమణ్యం అధ్యక్షతన మండలంలోని 8 లేఅవుట్లలో కేటాయించిన 603 మందికి రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన ఇళ్ల పట్టాలను ఆయన లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే జగనన్న లక్ష్యం అన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు సైతం నిర్మించి ఇచ్చారన్నారు. విజయవాడ, వైజాగ్ లాంటి మహా నగరాల్లో సెంటు రూ.20–30 లక్షల విలువ జేసే స్థలాలను ఇచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చారని, రూ.3.64 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు పేరు చెప్పగానే ఒక్క పథకం అయినా గుర్తుకు వస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేస్తే బాబుకు కళ్లు, కడుపు మంట అన్నారు. ఎన్టీఆర్ కుటుంబానికి మేలు జరిగినా బాబు ఓర్చుకోలేడన్నారు. అందుకే ఎన్టీఆర్ కొడుకులను నామరూపాల్లే కుండా చేశాడన్నారు. అభివృద్ధి చేస్తే ప్రశంసించాలే గాని, బురద జల్లడం పనిగా పెట్టుకున్న బాబుకు త్వరలో జరిగే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆయన మహిళలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, కరుణ్‌రెడ్డి, జగన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నిఖిల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, రామసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, దేవదానం, ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం 498 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపేద మహిళలకు సొంతిల్లు ఉండాలని సంకల్పంతో ఇంటి స్థలాన్ని మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు.అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ఒక్క పైసా ఖర్చులేకుండా రిజిస్ట్రేషన్ పత్రాలు అందించడం అభినందనీయమన్నారు. మండలంలో 183 మంది లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఆగ్రోకార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అంజనాగౌరి పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. మంచి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మహిళలందరూ ఆదరించి ఆశీర్వదించాలన్నారు. అనంతరం 881 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జి.ఎస్.భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.వి.ఎస్.ఆర్, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, అటవీశాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, మండల ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్.ఆర్, జేసీఎస్ కన్వీనర్లు ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, మైనార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దుష్ట శక్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

వీరపునాయునిపల్లె : వచ్చే ఎన్నికల్లో దుష్ట శక్తులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నేలతిమ్మాయపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె, మర్రిపల్లె గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీకి ఓటమి భయం పుట్టు కొందని అందుకే జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు లు పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో పార్టీలన్నీ ఒక వైపు ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి సింగల్‌గా పోరాటానికి సిద్ధమయ్యాడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల పరిశీలకుడు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ విజయ్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

చింతకొమ్మదిన్నె : ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని తాడిగొట్ల గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు.